

# కొత్తగూడెం పోరగాడికో లవ్‌లెటర్

సామాన్య

ప్రియమైన బుజ్జీ!
ఎలా వున్నావ్? నిజానికి నీకు మెయిల్ చేద్దాం అనుకున్నాను. ఇట్లా రాసి అట్లా సెండ్ కొట్టగానే నిముషంలో అందిపోతుంది కదా హాయిగా అని. అదీకాక, అలిగి వెళ్లిందికదా, బెంగాలి రసగుల్లాలాటి లవ్ లెటర్ ఒకటి రాసేస్తుంది అని మాటిమాటికి మెయిల్ చెక్ చేసుకుంటూ ఉంటావు కదా, దిగులు పిట్టవై, అంత బిజీ షెడ్యూల్‌లోనూ సిస్టం చుట్టూ ప్రదక్షిణలు చేసేస్తూ వుంటావ్ కదా అని.

కానీ... ఈసారి నాకు బాగా బాధ వేసింది బుజ్జీ. అందుకే ఎదురుచూడనీ అట్లా.... అని కచ్చగా అనిపించింది. అయినా చెప్పాలనుకున్నది చెప్పాలి కదా అని, కాగితం కలం పట్టుకుని ఇట్లా రాతకి కూర్చున్నాను. ఆ తరువాత పోస్ట్ చేస్తాను. ఉత్తరం అన్ని ఊర్ల మీదుగా ప్రయాణం చేసి... చేసి, నీకు చేరేప్పటికి నాలుగు రోజులైనా పడ్తుంది కదా. ఆ నాలుగురోజులూ నువ్వు, 'ఇంకా తిట్టలేదేం, ఇంకా తిట్టలేదేం,' అని కళ్లు కాయలు కాసేట్టు ఎదురుచూసేస్తుంటావ్ కదా, (నేనో పక్క తిడ్తుంటే నీ ముఖంలో చిచ్చుబుడ్లు ఎందుకు వెలుగుతాయో రీసెర్చ్ చెయ్యాలబ్బా!) ఆ ఎదురుచూపే ఈసారి నీకు నేను విధిస్తున్న శిక్ష. లేకపోతే ఎంత మాటన్నావ్ బుజ్జీ నన్నూ...!

ఇవాళ పొద్దునే ఇంటికి చేరా. ఇంటి గేటు తీయగానే చిన్న తమ్ముడు ఎదురొచ్చి పెట్టె బుట్టా అందుకున్నాడు. ముఖాన్ని నిచ్చెమల్లె పువ్వల్లె పూయించేసి అక్కడే అడిగేశాడు. "ఈసారి ఏ విషయం చర్చించుకున్నారు మీరు?" అని. మన పోట్లాటలు వాడికి చర్చలన్నమాట. సరేలే అని విషయం చెప్పానా, పూర్తిగా వినకుండానే, 'మీరు చాలా ఎక్కువగా మాట్లాడుకుంటారబ్బా. ఒబామా ఏమన్నాడో, మాయావతి ఏం చెయ్యబోతుందో, మమతా బెనర్జీ ధీరురాలో కాదో... అన్నీ మీకే కావాలి,' అనేశాడు.

నేను మా అమ్మ ఇచ్చిన కాఫీ పుచ్చుకుని, కుర్చీ ఎక్కి, 'మాకు కాకపోతే ఇంకెవరికి కావాలోరేయ్,' అన్నానా.. పక్కనే వున్న మా మేనమామ అందుకుని, 'భార్యాభర్తలలో ఒకరికైనా తెలివి తక్కువగా వుండాలిరా, అప్పుడే ఆ కాపురం సక్కగా వుంటుంది,' అన్నాడు. అంటే ఆబ్వియస్లీ ఆడవాళ్లకి తక్కువ తెలివి వుండాలని దానర్థంలే. నువ్వే గనక అప్పుడిక్కడ ఉండి ఉంటే, సమస్త స్త్రీల పక్షాన నిలబడి, 'ఇంకానా ఇకపై చెల్లదని,' ఖండించి పారేసి ఉండేవాడివి... నువ్వు అపరంజి బంగారానివిలే. నేనే దుర్మార్గురాలిని. ఊర్కూర్కే నిన్ను తిట్టిపడేస్తూ ఉంటా!

అయినా నువ్వు కూడా తక్కువా ఏంటి? అనవసరంగా గిల్లికజ్జాలు పెట్టేస్తావ్. నిజాయితీగా చెప్పు బుజ్జీ, మనకసలు ఏం విభేదాలున్నాయ్? వుంటే గింటే అవన్నీ మిత్ర వైరుధ్యాలే కదా! (కొంచెం భారీ పదం వాడేశాలే. డైలాగ్ కాస్త బరువుగా ఉంటుందనీ...)

ఏదో ఒక 'వాదినై' ఉండి తీరాలని నువ్వంటావ్. కేవలం నా ఒక్క బాధకో నీ ఒక్క బాధకో స్పందిస్తే అది మనిషితనం కానే కాదంటాను నేను. సమస్య ఎవరిదన్నది కాదు, న్యాయం ఎవరిదన్నదే ముఖ్యం. అవునా.... కాదా? దళితులు తమ సమస్యకే కాకుండా ముస్లిముల సమస్యకీ, స్త్రీల సమస్యలకి కూడా స్పందిం

చాలి. పురుషులు కార్మికులుగా, దళితులుగా, ముస్లిం లుగా తమ సమస్యకే కాకుండా స్త్రీల సమస్యలకి కూడా స్పందించాలి. అది నా సిద్ధాంతం.

అయినా.... నేనేమన్నాననీ అసలు? తన విగ్రహం పెట్టమని శ్రీశ్రీ చెప్పేడా? చెప్పలేదు కదా? అందరి విషయం వదిలేద్దాం. శ్రీశ్రీ బ్రతికి వుంటే తెలంగాణా పట్ల ఆయన అవగాహన ఏమై ఉండేదో నీకు తెలీదా? తెలుసు కదా! అంతవరకే నా బాధ. అవును తెలంగాణా ఉద్యమం నదీ వరద లాటిది. అప్పుడా నది విగ్రహాలపై విరుచుకుపడింది. న్యాయమే. అయితే మాత్రం, నా కన్ను చెమర్చిందంటే దానికి నేను బాధ్యురాలినా? 'అనేకులింకా, అభాగ్యులంతా, అనాధులంతా, అశాం తులంతా, దీర్ఘశ్రుతిలో, తీవ్ర ధ్వనితో విప్లవశంఖం విని పిస్తారోయ్,' అన్న పీడిత పక్షపాతి శ్రీశ్రీ బాధ్యుడా? అది నీకు అర్థంకాలేదా?

ఏమోలే! నాదే తప్పు కూడా అయ్యుండొచ్చు. ఒకవేళ విగ్రహ విధ్వంసం మీద శ్రీశ్రీ తన అభిప్రాయం చెప్పగలిగి వుంటే, 'అసంతృప్తి ప్రకటనకు విగ్రహ విధ్వంసం ఒక ఆయుధం అనుకుంటే, పీడితులారా, నావి మరో వొంద విగ్రహాలు పగల కొట్టండి,' అనేవాడు. కాదంటావా?

బుజ్జీ, పోనీ ఒకవేళ అజ్ఞానంతో నా కన్ను చెమ ర్చిందే అనుకో, అంతమాత్రాన నన్ను, 'నువ్వు ఆంధ్రా దానివి కదా' అనేసెయ్యొచ్చా? 'ఇలా జరిగి వుండా ల్సింది కాదేమో,' అన్నందుకే నేను ఆంధ్రా పీడకురాలినై పోతానా? అంతలా తిట్టేయొచ్చా నన్ను? అంత చెడ్డ పిల్లనా నేను? ఆ మాట నన్ను చాలా బాధపెట్టింది బుజ్జీ. ఇప్పుడు నీతో స్వేచ్ఛగా ఏదైనా మాట్లాడాలంటేనే భయం వేస్తోంది.

మొన్న నీ ఫ్రెండ్ పెళ్లికి వెళ్లాం కదా, వస్తూ వున్న దార్లో శ్రీశ్రీ విగ్రహం కనిపించింది. ఆ విగ్రహాన్ని చూసి నాకు చాలా దిగులేసింది. మనకి ఎవరిమీదైతే గొప్ప గౌరవం వుంటుందో వారినే కదా విగ్రహాలు చేసి పెట్టు కుంటాం. అంత పెద్ద విగ్రహం పెట్టారు కదా శ్రీశ్రీది. ఎంత బాగున్నాడూ... చక్కగా షర్ట్ ఇన్ చేసి, చేతిలో పుస్తకం పట్టుకునీ... కానీ ఏం లాభం? ఎంత లావు ఎండ కాస్తుందీ... అంత ఎండలో శ్రీశ్రీ అలా నిల్చోవడం నాకు నచ్చలా. మన ఇంటి దగ్గర 'టాకూర్ పంచానన్ భర్మన్' విగ్రహం వుంటుంది కదా, ఆ విగ్రహం కూడా జోరు వానల్లో పొట్టు పొట్టు తడిచిపోతూ వుంటుంది. మన బెడ్‌రూం కిటికీలో నుండి కనిపిస్తూ వుంటుంది కదా, చూసినప్పుడల్లా అయ్యో తడిచిపోతున్నాడే అని దిగులేస్తుంది. ఏం, విగ్రహం పెట్టేప్పుడు కాస్త పైన ఒక షెల్టర్ కూడా వెయ్యలేకపోయారా... అనిపిస్తుంది, అట్లా వేస్తే ఎంత బాగుంటుంది! ఆ రోజు అదే విషయం నీకు చెప్దామని నోటి వరకూ వచ్చి, భయం వేసి ఊరుకున్నా.

బుజ్జీ అసలు చెప్పు నేనెందుకు ఆంధ్రనైతా? మన చూట్టూ వున్న విషయాల నుండి ఇదిగో ఇవి తప్పు అని గ్రహించుకున్న తరువాత, విజ్ఞులమూ, సంస్కార వంతమైన వ్యక్తిత్వం కలిగినవాళ్లమూ అయితే ఆ తప్పుల నుండి బయటపడిపోతాం. అప్పుడిక మనం దానికి చెందం. కులమైనా, మతమైనా... జెండరైనా... మరోటైనా... ఇది కూడా అంతే. సలక్షణంగా నేను తెలం గాణా అమ్మాయినే అవుతా. ఎందుకంటే తెలంగాణా పట్ల నాకున్నది సానుభూతి కాదు. అక్షరాలా హృదయపు లోతుల్లోంచి వస్తున్న దుఃఖం. అది నీకూ తెలుసు. అయినా అనుమానం కదా?

నువ్వనేనా ఏమిటి! ఆమధ్య హైదరాబాద్‌కి వెళ్లి నప్పుడు నా కవిమిత్రుడిని కలిశాను. నే వెళ్లేసరికి అతను చాలా ప్రశాంతంగా ఖలీల్ జిబ్రాన్‌ని చదువుకుంటూ వున్నాడు. ఇద్దరం పిల్లల గురించి జిబ్రాన్ ఏమన్నాడో మాట్లాడుకుంటున్నాం. ఇంతలో చాయ్ వచ్చింది. అతను టీ తాగుతున్నంతసేపూ ఒక్క మాటా మాట్లాడ లేదు. ఆ మౌనమంతా టీ మాధుర్యమే అనుకున్నా. తీరా చూద్దునుకదా, అంతకాలం ఉలుకూ పలుకూ లేని అగ్నిపర్వతం బళ్లున బద్దలై, లావాని వెళ్లగక్కినట్టు, తను ఫలానా ఆంధ్ర రాజకీయ నాయకురాలిని తిట్టడం మొదలెట్టాడు. ఆవిడ ఇంకో ఫలానా రాజకీయ నాయకుడ్ని ఎలా నుదిటిపైన చుంబించిందో... అదెంత సిగ్గుమాలినతనమో చెప్తూ, తెలంగాణా స్త్రీలు అలా ఏనాటికీ సిగ్గుమాలరనీ, ఆంధ్రా స్త్రీలంతా అలాటివారనీ ఇలాటివారనీ అన్నాడు. ప్రతి మనిషికీ వారి వారి అను భవాలను బట్టే కదా అభిప్రాయాలు ఏర్పడుతాయి. అందుకని నేనేం బదులు మాట్లాడలేదు. మళ్లీ యేవో మాట్లాడుకున్నాం. ఇంటికొచ్చేశాను.

ఇంటికొచ్చేసిన తరువాత ఎప్పటికో నాకోటి తోచింది. మామూలుగా, సందర్భాన్ని అనుసరించి రాజ కీయమో మరోటో మాట్లాడుకోవడం వేరు. కానీ నన్ను చూడగానే అతనికి ప్రతిసారీ ఆంధ్రా సిగ్గుమాలినతనం జ్ఞాపకం వస్తుంది. అవును అది అక్షరాలా నిజం. కానీ ఎందుకలా? ఎంత ఆలోచించినా నేనేం పొరపాటు చేస్తున్నానో, ఎక్కడ లోపం జరుగుతోందో అర్థమయ్యి

చావలేదు. ఆంధ్రులు వేరు, ఆంధ్రా పెట్టుబడిదారులు, సామ్రాజ్యవాదులు వేరని బాగా చదువుకున్న అతనికి ఎందుకు తోచలేదు? మిగిలిన విషయాల్లో అతనంత స్నేహశీలి మరొకరు వుండరు.

ఇప్పుడు తెలుసా, అతని దగ్గరికి వెళ్లినప్పుడు నాకు తెలీకుండానే పైట నిండుగా కప్పుకోవాలనిపిస్తోంది. ఇబ్బందిగా అనిపిస్తుంది. నేనెందుకు 'ఆంధ్రా' నైతా అనిపిస్తుంది. నేను మనిషినబ్బా అంతే. అంతకు మినహా నాకే ఐడెంటిటీ అక్కర్లేదు. కాదు ముద్ర వేసుకోమంటావా... నేను పీడితురాలిని, సహ పీడితుల కోసం దుఃఖపడుతున్న దాన్ని. మీరు నమ్మాలి అంతే.

కానీ బుజ్జీ, నాక్కూడా తెలుసు నా బాధ చాలా అల్పమైనదని. ఆంధ్రా పీడకుల వ్యవహారశైలి ముందు, తెలంగాణుల ఈ తరహా ఆక్రోశ వ్యక్తీకరణ ఏపాటిదిలే. నెగ్లిజిబుల్. అయినా, స్వతహాగా సాత్వికులు, సున్నిత మనస్కులు, స్వవిమర్శకులు అయిన మీరు ఈ పొరపాటు కూడా చెయ్యకూడదని నా బాధ. అయినా ఎవరికైనా ఓపిక ఎంత దూరం వుంటుందిలే. తెగే దాకా లాగితే తెగదా... మీ ఈ తిట్లన్నిటికీ బహుశా నేను అర్హురాలినేమోలే.

బుజ్జీ, 2009లో రిఫ్రెషర్ కోర్స్‌కి హైదరాబాద్ వెళ్లా గుర్తుందా? నేనసలే మనుషుల్ని చూస్తే ఉష్ట్రపక్షిలా దాక్కుంటా కదా. అప్పుడు కూడా క్లాస్‌రూంలో ఒక మూలకి ఒదిగి అట్లాగే కూర్చున్నా. ఒకతను సెమినార్ ఇస్తున్నాడు. హఠాత్‌గా మధ్యలో, అదిగో అక్కడ కూర్చుండే అక్క అంటూ నన్ను చూపించి, 'రావచ్చు పోవచ్చు రొయ్యలమ్ముకోవచ్చు,' అని పాట పాడాడు. నోరు తెరిచి నాలుగు మాటలైనా ఎవరితో మాట్లాడనే లేదే... ఇంతమందిలో నేను ఆంధ్రా అమ్మాయినని ఈ పిల్లాడికెట్లా తెలిసిందా అని మొదట భలే ఆశ్చర్యమేసింది. పాట ఇచ్చిన సందేశం మంచిది. దాంతో నాకేం ఇబ్బంది లేదు. కానీ నన్నెందుకు స్పెసిఫై చేయాలి. కోప మొచ్చేసింది. కోపమొస్తే ముందెవడున్నాడు, వెనకేమవుతుందీ చూసుకోను కదా... ఇహ అంతే అతనితో జగడానికెళ్లా.

రియల్ ఎస్టేటులూ, రొయ్యల గుంటలూ, డాబు మాటలూ వద్దనుకున్నదాన్ని కదా. పాట, పోరు కలిసిపోయి దిల్దారు గుండెమనిషి కావాలని, నీ చేయి పట్టిన దాన్ని కదా నేను. నా గురించి అతనికేం తెలుసని పాడేస్తాడు చెప్పు? తప్పు కదా! అందుకే గయ్ గయ్‌మని అరిచా... అట్లా మా ఇద్దరికీ స్నేహం కలిసిపోయింది.

ఇప్పుడేమో అందరికీ మా అక్క అని, స్వంత అక్కలా ప్రేమగా చెప్పుకుంటాడు. నన్ను నమ్మడానికి ఆ పిల్లాడికి రెండేళ్లు పట్టింది. బుజ్జీ నీకెన్నేళ్లు పడ్తుందో చెప్తావా?

సరే... ఆ రిఫ్రెషర్ కోర్సులోనే ఏమయిందో తెలుసా...? మాకో గ్రూప్ ప్రాజెక్ట్ వర్క్ ఉండింది. తెలంగాణ గ్రామదేవతల్ని ఎంచుకున్నాం. ఒకావిడ టీం లీడర్... ఎట్లాగో ఆరు గ్రూపుల్లో మాది ఆల్ విమెన్ గ్రూప్ అయ్యింది. కానీ చివరిలో ఒకతనొచ్చి మా గ్రూపులో చేరాడు. గ్రామదేవతలలో ఒకే ఒక మగ దేవుడు వుంటాట్ట కదా... పోతురాజు అని. మా గ్రూప్లో ఒకే ఒక్క మగవాడు కదా, అందుకని అందరూ అతన్ని 'ఓ... అయితే నువ్వు పోతురాజువన్నమాట,' అని టీజ్ చేసేవారు. నన్నేమో ఎల్లమ్మ దేవత అనేవారు. ఎందుకలా అంటే, ఎల్లమ్మ దేవత అందంగా వుంటుందీ అనేవాళ్లు. నాకు ఈ దేవతల గురించి పూర్తిగా తెలీదులే. కానీ దుర్మార్గుడివి నువ్వు, తెలంగాణా తెలంగాణా అంటావు కానీ, నన్నెప్పుడైనా అట్లా ఎల్లమ్మా అన్నావా. అనలేదు. అందుమూలంగా కూడా నేనిప్పుడు అలుగుతున్నా.

సరే అట్లా ఒకరోజు మా ప్రజంటేషన్ స్టార్ట్ అయింది. పరిచయం చేసే పని నాకు... ముగించే బాధ్యత అతనికి అదే పోతురాజుకి వచ్చింది. ముగిస్తూ ముగిస్తూ అతను మంచి తెలంగాణ ఉద్యమ గీతం ఒకటి అందుకున్నాడు. చాలా బాగా పాడాడు. నిజం చెప్పాలంటే, నాకు రోమాంచితమయింది. కానీ మా టీం లీడర్‌కి అట్లా కాలేదు. ఆవిడకి చిర్రెత్తిపోయింది. డయాస్ దిగి రాగానే అతని పైన విరుచుకపడింది. ఆ విరుచుకపట్టం ఒక్కరోజుతో ఆగలేదు. అలా పోయిళ్లు పొయిళ్లుగా సాగుతూనే ఉండింది. పాపం తిరిగి అతనేం మాట్లాడేవాడు కాదు.

చూసి చూసి నాకు చిరాకొచ్చేసింది. ఆఖరికో రోజు, 'చూడండి అతని భావాలేవో అతను ప్రకటించుకున్నాడు. మనందరం ఏదో ఒక రూపంలో అలా వ్యక్తీకరిస్తూనే వుంటాం కదా. దానికెందుకలా ఇరిటేట్ అవుతున్నారు,' అన్నాను. అందుకు ఆవిడన్నారు, 'ఎప్పుడో వచ్చాం హైదరాబాద్‌కి. తినీతినక, దాచుకుని చిన్న ఇళ్లు కట్టుకున్నాం. ఇప్పుడు వీళ్లు తెలంగాణా అనగానే మేం అన్నీ వదులుకుని వెళ్లిపోవాలా?' అని. నేనన్నాను, 'అలా ఎవరైనా మీతో అన్నారా? అనలేదుకదా! పైపెచ్చు ఉద్యమ నాయకులు, రాజకీయ నాయకులూ ఏక

కంఠంతో చెప్తున్నారు కదా, బతకడానికి వచ్చినవారితో మాకు పేచీలేదు అని. మరింక భయమెందుకు? అభద్రత ఎందుకూ?' అని. ఆవిడ అప్పటికేం మాట్లాడ లేదు. కానీ అతను కన్పించిన ప్రతిసారీ ఏదో ఒకటి అంటూనే వుండేది. పాపం అతను, నిజంగా తనేదో తప్పు చేసినట్టు తలొంచుకునేవాడు. ఇక ఇట్లా కాదు అనుకుని, అతన్నేమైనా అనబోయినప్పుడల్లా ఆవిడని నేను చర్చల్లోకి లాగటం మొదలెట్టాను. అట్లా వుంటాయ్ ఆంధ్రోళ్ల చెయిదాలు. తెలంగాణా వాళ్లు తిడతారూ అంటే తిట్టరా మరి.

సరే... నీ మీద అలిగి కదా వస్తున్నాను... ఒక్క దాన్నే కదా... మా ఊరి బస్సేమో రాత్రి పదకొండింటికి కానీ బయల్దేరదు! అందుకని నా ఫ్రెండ్ శివాకి ఫోన్ చేశా, 'కాస్త ఏర్‌పోర్ట్‌కి రా... బస్సెక్కే వరకూ కంపెనీ ఇద్దువుగానీ...' అని. ఏర్‌పోర్ట్ నుండి బయటకి వచ్చానో లేదో ముఖం చేటంత చేసుకుని, 'ఏం గొడవేంటి ఈసారి? సద్దాం హుస్సేన్ చచ్చిపోయి చాలా రోజుల యింది కదా,' అన్నాడు. ఆ స్పైస్ జెట్‌ఫ్లైట్ వాడు తినటానికి ఏమీ పెట్టి చావడు కదా. నాకేమో చచ్చేట్టు ఆకలేస్తోంది. ఆకలికి కోపమొచ్చింది. అందుకని, 'నీ మొహంలె... నోరుమూసుకో! సాఫ్ట్‌వేర్ ముసలి మొహమూ నువ్వునూ. సద్దామట సద్దాం. నాకు ఆకలే స్తోంది,' అన్నాను. తిన్నంతసేపూ నిజంగానే నోరు మూసుకు కూచున్నాడా.... అయిపోగానే మళ్లీ అడి గాడు. 'ఏంటీ కొట్లాటా?' అని. పోనీలెమ్మని చెప్పానా.. ఇక మొదలెట్టాడు... 'ఈ తెలంగాణావాళ్లు అంతే. మోటోళ్లు. మనం లేకపోతేనా... ఉస్మానియాని క్లబ్ చేసేసి చీట్లాట ఆడుకుంటూ వుందురు,' అంటూ... నాకు బండ కోపమొచ్చింది. 'హైదరాబాదులో ఎన్ని ఆస్తులున్నా యేమిటి తమరికి,' అని అన్నాను. ఎందు కడిగానో... ఏవిటో గమనించాడా... అబ్బే... వాడి ధోరణిలో వాడు, 'ఎక్కడా! నీకు తెలీదా, మనూర్లో ఇల్లు తీసుకున్నా కదా, ఆ లోనే ఇంకా తీరలేదు.' అన్నాడు. 'మరి ఎవరైనా ఆంధ్ర రాజకీయనాయకుల దగ్గర ఏమైనా పుచ్చుకున్నావేమిటి? అంతలా రెచ్చుతున్నావ్.' అన్నాను. ఏమన్నా వాడికి కోపం రాదులే... చిర్నవ్వుతో, 'నువ్వు వల్లించేవన్నీ కిరణ్ మాటల్లే, నాకు తెలీదా!" అన్నాడు.

నాకు చిరాకొచ్చింది. 'కిరణ్ మాటలో ఇంకోరి మాటలో విని, అభిప్రాయాలు ఏర్పరచుకోవడానికి, నేను నీకులాగా తల కంప్యూటర్‌కి తగిలించుకుని లేను. హ్యూమానిటీస్ చదువుకొచ్చాను. ఆ పేపరోడు చెప్పిందో, ఈ టీవీవాడు చూపించిందో చూసి, స్వంత బుర్ర లేకుండా మాట్లాడుతోంది నువ్వు. నిజానిజాలు తెలుసుకోలేవా? ఇట్లా మాట్లాడటం మానుకోకపోతే నా స్నేహ సౌభాగ్యానికి దూరం చేసేస్తా... ఇక నీ ఇష్టం,' అన్నాను.

వాడే కాదులే మా బంధువులున్నారు కదా... వాళ్లూ అంతే... పెట్టుబడిదారుల ఏడుపుని తమదిగా చేసుకుని ఏడుస్తుంటారు. మావాళ్లు ఎంతమంది మద్రాసులో బెంగుళూరుల్లో సెటిలయ్యి రాజాల్లాగా బతికేయడం లేదూ... అక్కడెవరు కొట్టారు వీళ్లని. రేపు తెలంగాణా వచ్చినా అంతే కదా. ఆహా! ఇది మాత్రం అట్లా కాదు. ప్రతి వాడికీ ఏడుపే, ఎవడి ఏడుపు వాడిదీ, అవతలి వాడి బాధతో పనే లేదు. అసలు లోపం ఏంటో తెలుసా. మనుషులలో సహృదయత మిస్సింగ్. దాన్ని ఒప్పుకోవాలి.

ఇదిగో, ఇలా మాట్లాడుతానని బంధువులూ, స్నేహితులూ నన్ను తెలంగాణా తీవ్రవాది కింద జమ కట్టేసుకుని నీళ్లొదిలేశారు నువ్వేమో, 'ఆంధ్రదానివి,' అని గీతకవతలే నిలబెట్టేశావ్. యెట్లా చచ్చేది బుజ్జీ నీతో?

సరే! నువ్వన్నట్టే, లేదంటే మీరందరూ అంటు న్నట్టే... నేను ఆంధ్రాదాన్నే అనేసుకుందాం. ఏం ఆంధ్రోళ్లలో మంచోళ్లే ఉండరా?

రావిశాస్త్రి కథ ఒకటి వుంది పుణ్యం అని. అందులో రెండు పాత్రల మధ్య సంభాషణ ఇది, 'లోకంలో పాపపుణ్యాలు లేవు లాభనష్టాలే వున్నాయ్,' అని మొదలెట్టి, 'మంచితనం మీద నమ్మకం ఏ వెధవకి వుంది? వెధవలకి వెర్రిపీరులకీ వుంది. మంచీ చెడ్డా పాపం పుణ్యం అంటూ ఏంలేవు సోదరా,' అని తీర్మానిస్తాడు ఒకడు...

అతనే, పోలమ్మ అనే ఆవిడ గురించి చెప్తూ, 'పోలీసుల్లో పుణ్యాత్ములున్నారంటుంది,' అంటాడు.

అందుకు ఇంకో పాత్ర, 'బ్రాహ్మల్లో కూడా మహా త్ములుంటారన్నాడు గురజాడ...'

'వెటకారంగా అనుంటాడు...'

'అలాంటప్పుడు పోలీసుల్లో పుణ్యాత్ములుండ టానికేం? ఉండొచ్చు. వెర్రివాళ్లకి తప్పక ఉండొచ్చు. అయితే పోలమ్మకున్న లాంటి వెర్రే నీకూ వుందని నన్ను నమ్మమంటావ్.'

ఎంత అద్భుత కథకుడు కదా రావిశాస్త్రి. ఇదంతా రాస్తుంటే ఆ కథ గుర్తొచ్చింది. పనిమాలా పుస్తకం వెతికి, ఈ లైన్లు రాసాను. వీలు చూసుకుని కథ చదువు. అయినా పోలీసుల్లో, బ్రాహ్మణుల్లో పుణ్యాత్ములుం డరని ఎవరమైనా ఎలా అనగలం చెప్పు? అట్లాగే ఇదీ... ఆంధ్రోళ్లలో మంచోళ్లే ఉండరని ఎవరైనా గేరంటీ సర్టిఫికేట్ ఇచ్చారా? లేదుకదా! ఏమంటావ్ బుజ్జీ! నేను చెప్పింది నిజమా.. కాదా? ఏమంటావ్ లే, 'నువ్వు కూడా పోలమ్మలాటి వెర్రి పీరు,'వంటావ్ అంతే కదా. కానీ రావిశాస్త్రి ఏమన్నాడో తెలుసా, 'పోలీసుల్లో కూడా మంచితనం చూడగలిగిన పొలమ్మ మంచితనం మీద నాకు నమ్మకం వుంది,' అంటాడు. రావిశాస్త్రి మేధావి కదా... అంచేత మా ఇద్దరి అభిప్రాయాలు కలిసాయన్న మాట (ఇక్కడ ఒక స్మైలీ వేసుకో). రావిశాస్త్రే కాదబ్బా మీ నాన్న 'ది గ్రేట్ రాయమల్లు మొఖద్దాం' కూడా ఎంత మేధావి. 'అమ్మా! వయసులో చిన్నదానివా, పెద్దదానివా అనేది ముఖ్యం కాదు. ఎవరు జ్ఞానులో వారే పెద్ద. మా ఇంటికి నువ్వే పెద్దవి,' అనలా? అట్లాంటి ఇంత పెద్ద జ్ఞానిని పట్టుకుని ఆంధ్రా ఆంధ్రా అనేస్తావ్ మాటికొస్తే. అసల నీ తరహా నాకేం నచ్చలేదుపో...!

బుజ్జీ! ఒకరోజు షాజహానాది 'అపరిచిత' అనే కవిత చదివి వినిపించా నీకు... గుర్తుందా? ప్రతి ముస్లిమూ ఒసామా కాదంటుంది ఆ అమ్మాయి.

*మీ రూంకెవరెవరో వస్తున్నరు*
*వస్తున్నోళ్లంతా ఒసామాలని*
*ఓనర్ నిర్మొహమాటపు సందేహం*

అంటుంది. ఎంత దుఃఖభరితమైన వ్యక్తీకరణ కదా అదీ. చివర్లో

*రాజ్యమొక్కటే కాదు...*
*మనుషులూ మనసులూ లౌకికం కావాలి కదా*

అంటుంది. ఆ వాక్యాలు నీకెంత ఇష్టం కదా. ఎన్నిసార్లు మననం చేసుకుంటావో కదా. నిజం, ఇప్పుడు కావలసింది మనుషులూ, మనసులూ లౌకికం కావడమే. ప్రతి ఆంధ్రా వ్యక్తీ సామ్రాజ్యవాద పెట్టుబడి దారుడు కాడు, ప్రతి ముస్లిమూ ఒసామా కాదు. కానీ, ప్రతి తెలంగాణా వాడూ పరోక్షంగా అనేకరకాలుగా, ప్రత్యక్షంగా కొన్నిరకాలుగా ఆంధ్రా పీడితుడే, శరీరం లోని అణువణువులోనూ దుఃఖితుడే. అది నిస్సందేహం. నేనేంటి బుద్ధిలో హృదయం మిళితమై వున్న ప్రతి ఒక్కరూ ఆ విషయాన్ని ఒప్పుకోవాల్సిందే. కానీ నేను ఆంధ్రా పెట్టుబడిదారుని కాదు బుజ్జీ. ప్లీజ్, ఒప్పుకో!

ఉమర్ ఆలీషా అని పాతతరం ముస్లిం కవి పద్యమొకటి గుర్తొస్తోంది...

*ఆర్య రక్తంబు వీరి దేహములయందు*
*స్వచ్ఛమై నేటి దాక పారుచుండె*
*మతము వేరైన జాతి సమ్మతము గాదె*
*భ్రాతృ వరులార సుగుణ సంపన్నులార...*

అని. అర్థం ఏంటంటే- 'మాది ముస్లిం మతమే కావచ్చు కానీ, మనది భారత జాతి,' అని. ఇంకా ఆశ్చర్యం ఏంటంటే... ఆ ముస్లిం కవి అనసూయాదేవి పాతివ్రత్యం పైన, మహాభారతం పైన కావ్యాలు రాశాడు... అతను చిత్రించినంత అద్భుతంగా కర్ణుని వ్యక్తిత్వాన్ని, నాకు తెలిసినంతవరకూ.... ఏ హిందూ కవీ చిత్రించలేదు. బుజ్జీ... అతని కర్ణుడు అంటాడూ-

*కుంతికి బుట్టినన్ మరి శకుంతలకు బుట్టిన*
*బుట్టనిమ్ము నే*
*యింతికొ మానవుండు జనియించుట తథ్యము*
*నాకు దానికిన్*
*వంత యొకింత లేదు బలవంతముగా నిది*
*తల్లియంచు నీ*
*వింతగ చెప్పనేల పెర ఇంతులు తల్లులు గారె*
*మాధవా*

(కుంతికో లేక శకుంతలకో పుడితే పుట్టాను... మనుషుల మందరం ఎవరో ఒక స్త్రీకే పుడతాం. దాని గురించి నాకు ఎటువంటి చింత లేదు. ఇప్పుడు నువ్వు బలవంతంగా ఈమె నీ తల్లి నీ తల్లి అని అంతగా చెప్పాల్సిన అవసరం లేదు. పరస్త్రీలందరూ తల్లులే కదా కృష్ణా!)

ఎంత అద్భుతమైన భావన కదా! ఎక్కడి ముస్లిం కవీ, ఎక్కడి కర్ణుడూ... అలాటి ఆ కవిని పట్టుకుని నువ్వు ముస్లింవి.... కసాయివీ అని వేధించడం అన్యాయం కాదా? అతను ముస్లిమో లేకపోతే హిందువో ఎవరైనా కావచ్చు. ఎప్పుడైతే ప్రజాస్వామీకరణ చెందాడో అప్పుడే అతను మనిషి అయ్యాడు. కదా? ఇక అతను ముస్లిమేమిటి? అట్లాగే... నేను ఆంధ్రా ఏమిటి? అదన్న మాట ఆ పద్యానికర్థం. అర్థమయిందా బుజ్జీ!

పాపం మీ బాధలు అట్లాంటివిలే. స్త్రీగా కేవలం స్త్రీల బాధలే చూట్టం మొదలెడ్తే... ఖతం... ఇక జీవితంలో మంచి పురుషులే వుండరు. అదృశ్యమైపోతారు. ఆ పాటొకటి వుంది చూడు, 'నన్ను దోచుకుందువటే వన్నెల దొరసానీ' అని... ట్యూన్ బలే వుంటుందిలే. ఆ పాట విన్నప్పుడల్లా నాకు ఏమనిపిస్తుందో తెలుసా?

వన్నెలంటే పౌడర్లూ, రంగురంగు చీరలే కదా! పాపం అవి లేకపోతే ఆవిడ అతన్ని దోచుకోలేకపోయేదేమో కదానని. ఇంకా వలువలు మైనస్ దొరసాని ఈజ్ ఈక్వల్ టు సాని అవుతుంది కాబోలు అని కూడా ఆలోచిస్తాను. అసలకి ఎంత టూమచ్‌గా వుంది కదా ఈ ఆలోచన? ఏం చెయ్యమంటావ్ బుర్ర అట్లా కలుషితమైపోయింది. పురుష ప్రపంచంవైపు నుండి ఎల్లప్పుడూ నాకు మురుక్కాలవ కంపే వస్తుంటుంది మరి.

నిన్నటికి నిన్న బస్టాండ్‌లో కూర్చున్నానా... పక్క కుర్చీలో ఎవరో ఒకాయన కూర్చుని వున్నాడు. ఎట్లాగో ఆయన చొక్కా చేతి కొస నాకు తగిలింది. సర్రుమని చిరాకొచ్చింది. చేతిలో మొబైల్ తీసుకుని, 'చొక్కా కొస తగిలిస్తావా, చొక్కా కొస తగిలిస్తావా చెప్పు?' అని బుర్ర మీద మోదాలనిపించింది. పాపం ఆయన ఏదో టెన్షన్‌లో వున్నట్టున్నాడు. ఎవర్తోనో ఫోన్లో తీవ్రంగా మాట్లాడుకుంటున్నాడు. ఎంత గట్టిగా మాట్లాడుతున్నాడంటే, అసలు ఫోనే అక్కర్లేదు డైరెక్టుగా వాళ్ల ఊరోళ్లకి వినపడిపోతుంది... చొక్కా కొస సంగతి ఆయనకి ఎరుకే లేదు. ఇటువంటిదంతా నీకు చెప్తే, 'అలా అనుకోకూడదు. అందరు మగవాళ్లు చెడ్డగానే ఎందుకుంటారు?' అని సర్ది చెబుతుంటావ్ కదా... పోలీసుల్లో కూడా పుణ్యాత్ములుంటారని పోలమ్మ అనుకున్నట్లు, మగవాళ్లలో కూడా మంచి వాళ్లుంటారని, నువ్వు చెప్తే నేను నమ్మాకదా! మరి ఆంధ్రోళ్లలో కూడా మంచి వాళ్లుంటారని నేను చెప్తే నువ్వు కూడా నమ్మాలి. మనసు సరళం చేసుకోవాలి బుజ్జీ.

అవును బుజ్జీ! నువ్వెందుకు మీ భాష మాట్లాడవ్? దానిమీద నాకు చాలా అసంతృప్తి వుంది. ఎంత బాగుంటుందో మీ భాష. అనడానికేమో తెలంగాణా తెలంగాణా అంటారు కానీ.., మీరు మాట్లాడేదంతా ఆంధ్రుల భాష. అప్పుడు గెస్ట్‌హౌస్‌లో వుండేదాన్ని కదా... అ గెస్ట్‌హౌస్ కేర్‌టేకర్ ఒకసారి నా దగ్గరకొచ్చి అడిగాడు, 'మేడం మీరు తెలంగాణానా? ఆంధ్రానా?' అంటూ. నాకు ఎంత ఇబ్బందిగా అనిపించందంటే, ఎవరైనా వచ్చి మనల్ని సీరియస్‌గా మీరు మనిషా? మరోటా? అని అడిగితే యెట్లా అనిపిస్తుందో... అట్లా అనిపించింది. ఇప్పుడు నేనెవరినని చెప్పాలి? డైలమాలో పడి, 'ఎందుకడుగుతున్నారు,' అన్నాను. అందుకతను, 'మెస్ వర్కర్లు పందెం పెట్టారు, మేడం మా తెలంగాణా అని వాళ్లన్నారు. కాదు మా ఆంధ్రా అని నేనన్నాను. మిమ్మల్నిచూస్తే మా వైపు అమ్మాయిలా వున్నారు,' అన్నాడు. నేనేం మాట్లాడకుండా ఊరుకున్నాను. అయినా అతను వదలలేదు. పదే పదే అడుగుతుంటే ఇక విసుగేసి, 'ఇద్దరూ గెలిచారు పొండి,' అని మాత్రం చెప్పాను. వాళ్లకి ఆ అనుమానమెందుకు వచ్చిందో తెలుసా నా తెలంగాణా భాష చూసి.

నీకు చెప్పినట్టే గుర్తు. చాలారోజుల క్రితం అనుకుంటా. ఒకరోజు లైబరీకి వెళ్తున్నాను. అంతలో నన్ను దాటుకుని ఒకతను వెళ్లాడు. బలే బాగున్నాడు పొడవుగా, స్టయిల్‌గా చూడాలనిపించేట్టు. డైరెక్టర్ బి.నరిసింగరావు కాదుకదా అని ఆశ్చర్యపడి చూస్తున్నానా...! అంతలో అతను కాశీమజిలీ కథల్లాటి ఆకర్షణీయమైన వొంపుసొంపుల తెలంగాణా మాండలికంలో ఎవరితోనో ఏదో చెప్తున్నాడు. అతని భాషతో అతని అందం పదిహేను రెట్లు పెరిగింది. నువ్వు కూడా నీ కలుషిత భాషని వదిలించుకోవాలబ్బా... 'కలలు కూడా నా మాతృభాషలో రావటం మానుకుంటాయ్,' అని కవి ఖాదర్ మొహియుద్దీన్ అన్నట్లు, మన ఇంటిభాష మర్చిపోతే మనకు మనం లేకుండా పోతాం బుజ్జీ.

మనం రాజేందర్ నగర్ దగ్గర ఉన్నప్పటి సంగతి ఇది... అక్కడి చుట్టుపక్కల పిల్లలకి 'జోడో గ్యాన్'తో చదువు చెప్పాలని ట్రై చేసేదాన్ని గుర్తుందా? ఒకరోజు ఏమయిందంటే నా కళ్లద్దాలు ఫైబరో... ఇంపోర్టెడో... అలాటివేవో అనుకుంటా, చాలా తేలిగ్గా ఉంటాయ్. కళ్లకే పెట్టుకుని మరిచిపోయి, 'నా అద్దాలు కనిపించడం లేదు కాస్తా వెతకండ్రా,' అన్నాను... పిల్లలంతా ఇంకో అద్దాలు కామోసు అనుకుని పడీపడీ వెతికారు, కాసేపయ్యాక చూద్దాను కదా ఎంచక్కా చెవులు మీదే వున్నాయ్... అప్పుడొక పిల్ల, 'మస్తు లెంకిపిచ్చినవ్ అక్క,' అన్నది. అప్పుడే మొదటిసారి విన్న ఆ 'లెంకిపిచ్చినవ్' అనే మాట ఇప్పటికీ నాకు ఎన్నిసార్లు జ్ఞాపకం వస్తుందో.

వేముల ఎల్లయ్యది, 'కక్క,' అని నవలొకటి వుంది. ఎంత అందంగా వుంటుందో. మొత్తమంతా తెలంగాణా మాండలికమే, 'ఒగనాటి కిష్ణుడు అర్జుండు రదం వురికిస్తున్న సైమానా ఆళ్ల అయ్యమ్మలు సెపదం జేసింద్రంట! మడతన బుట్నోల్లని మడ్సకరా! ఎద్రుగాళ్ల బుట్నోల్లని ఎదుర్కరా!' అని ఆ లైన్ బలే బట్టీలే నాకు. నువ్వేం చెయ్యాలంటే ఆ నవల తీసుకుని మూడ్నాలుగుసార్లు చదవాలి. అంతే తన్నుకుని వచ్చేస్తుంది నీ భాష నీకు. అప్పుడు నాకు ఇంకొంచెం ఎక్కువ ప్రేమ కలుగుతుంది నీ మీద. ఒట్టు!

ఏంటో చెడ్డ కోపమొచ్చి వచ్చేసా కానీ, వచ్చినప్పటి నుండీ, 'పొద్దంతా నీ ధ్యాసే పాడిచేది నీ రూపే.'

అదీ కాక బోలెడంత పశ్చాత్తాపం కూడా కలిగిపోతుంది. పోన్లే! అంటే అన్నాడులే. పాపం వాళ్లేదో బాధల్లో వున్నారు కదా... తిడ్తే తిట్టారులే అని మనసు ఒకటే రొదపెట్టే స్తుంది. తంగేడుపూల బంగారు దారుల వెంట నా జీవితంలోకి నడిచొచ్చిన మంచితనానివి నువ్వు, బతుకమ్మ, నా జీవితంలో నింపిన ఆనందమనే రంగువి నువ్వు. నువ్వే కదా తిట్టావ్! ఇంకెవరో కాదుకదా! నువ్వెంత మంచివాడివి! అందుకని మనసులో బాధగా వున్నా 'ఆంధ్రాదానివనే' నీ తిట్టుని నానార్థ సహితంగా అంగీకరించేద్దామనిపిస్తుంది.

అవున్లే నువ్వు చెప్పేది అక్షరాలా నిజమేలే. 'సరే ధ్వంసమైన విగ్రహాలు ఎట్లాగూ ధ్వంసమయ్యాయి. మళ్లీ పెడదాం. ఎవరెవరు ఉండాలో ఈసారి మీరే చెప్పండి,' అని తెలంగాణులని అడగొచ్చు కదా? అడగరు. ఒక సామెత ఉందిలే. ఒక విధవావిడకి జుత్తు బాగా పెరిగిపోయిందంట. మనవడ్నీ, కొడుకునీ ఇంకా వాళ్లనీ వీళ్లనీ బ్రతిమాలిందట, 'బాబూ కాస్త క్షురకుడ్ని పిలుచుకొద్దురూ...' అని. ఒక్కరూ ఆవిడ మాట విన లేదంట. ఒకరోజిక దిగులుపడి, 'ఆయనేగానీ వుండుంటే నిమిషాల్లో క్షురకుడ్ని పిలుచుకొచ్చేవారు కదా,' అని భర్తని గుర్తు చేసుకున్నదంట. ఇదంతా చూస్తున్న ఇంకొకావిడ, 'పిచ్చిమొహమా, ఆయనే వుంటే మంగలాయనతో పనేమిటీ,' అన్నదంట. అట్లా... నా పిచ్చితనం కానీ, అంత నిష్పాక్షికంగా అన్నీ ఉండుంటే కథ ఇక్కడివరకు వచ్చుండేదా?

బుజ్జీ! నేను నీ అంత తెలివైనదాన్ని కాదు కదా. అప్పుడప్పుడూ అజ్ఞానంతో ఏదో మాట్లాడేస్తూ వుండొచ్చు. బహుశ నాకే తెలీకుండా నా ప్రాంతపు అహంకారాన్ని ప్రదర్శిస్తూ వుండి వుండొచ్చు కూడా. నిన్ను ఇబ్బందిపెడుతూ వుండొచ్చు. కానీ అదంతా తెలిసి చేసేది కాదు బుజ్జీ. కనుక మిత్రుడిలా సవరించు. కోపం వచ్చినా, కొంచెం పోన్లే పాపం అనుకో. సరేనా...! ఎందుకంటే.. నేను కూడా ఉత్తుత్తిదాన్నా ఏమిటి? 'పారే ఏటి అలల మీద పండు వెన్నెల రాలినట్టు ఊరే ఊట సెలిమలోన తేట నీరు తొణికినట్టు ఎండి మెరుపు నవ్వులో లచ్చుమమ్మని,' నువ్వేకదా చెప్తావ్! చెప్పు ఇప్పుడు కూడా అవును కదా? (ఇక్కడ కూడా ఒక స్మైలీ వేసుకో కావాలంటే, కానీ... కాదనకేం, పాపం బాగా బాధపడిపోతా తెలుసా!!!)

బుజ్జీ ఆలోచిస్తుంటే 'చేగువేరా' గుర్తొస్తున్నాడు. ఎక్కడి 'చె', ఎక్కడి పోరాటం కదా. హృదయం కావాలి, ప్రాంతాలు కాదు. అది కదా మనిషితనమంటే.

బుజ్జీ! తెలంగాణా ఉద్యమం మీది మాత్రమే అని నువ్వు ఫీలవుతున్నావ్. అది తప్పు. గద్దర్ యేమని పాడాడు? 'పోరు తెలంగాణమా... కోట్లాది ప్రాణమా...' అని కదా. నువ్వనుకుంటున్న ప్రకారమైతే ఈ పోరు తెలంగాణం మీ నాలుగు కోట్ల ప్రాణమే కావాలి కదా? మరి కోట్లా...ది ప్రాణం ఎందుకయింది?

ఎందుకయిందో తెలుసా బుజ్జీ? ఈ పోరులో ప్రతి పీడితుడూ తనని తాను చూసుకుంటున్నాడు కనుక, కోట్లాది ప్రాణమయింది. ఎక్కడి తెలంగాణా... ఎక్కడి డార్జిలింగ్... ఎక్కడి కూచ్‌బీహార్? మనమిక్కడ టెంట్ వేసి దీక్షకి కూర్చుంటే కూచ్ బీహార్ 'రాజ్ బన్షీ' 'గ్రేటర్ కూచ్ బీహార్ కీ జై' అని టెంట్ ఎందుకు వేస్తా డంటావ్? 'గోర్ఖ జనముక్తి మోర్చా' నిరాహార దీక్షె ఎందుకు సోలుతుందంటావ్? ఎందుకంటే ఈ పోరాటం వారి ఆశల దీపాలకు చమురునిస్తుంది కనుక. నమ్మకాన్నీ, ఉత్తేజాన్నీ ఇస్తుంది కనుక. ముందుకు కదిలే బలాన్నిస్తుంది కనుక.

సో, నా ప్రియమైన కొత్తగూడెం పోరగాడా! దిస్ లవ్ స్టోరీ నాట్ ఓన్లీ బిలాంగ్స్ టు యు, అనేక రకాలుగా పీడితురాలిని... అడుగడుగునా అణచివేతను అనుభవిస్తున్నదాన్ని... ఈ పోరాటం నాది కూడా. ఇది తేరీ మేరీ ప్రేమ్ కహానీ.

ప్రేమతో
షాహీన్

*ఆదివారం ఆంధ్రజ్యోతి, 18 డిసెంబర్ 2011*

